గర్భిణికి తప్పని డోలీ కష్టాలు

ప్రజాశక్తి -అనంతగిరి: రోడ్డు సౌకర్యం లేక గర్భిణీని డోలీ సహాయంతో ఎత్తైన కొండ కోనల మీదుగా తరలించవలసిన దుస్థితి నెలకొంది. మండలంలోని కొత్తూరు పంచాయతీ పరిధి టెంకబుడ్డి గ్రామానికి చెందిన గన్నెల సీతమ్మ కు గురువారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు గ్రామం నుండి ఎత్తైన కొండ కోనలు దట్టమైన అటవీ ప్రాంతం మీదుగా దిగువ ప్రాంతంలో కొత్తూరు మెయిన్ రోడ్డు వరకు సుమారు ఏడు కిలోమీటర్లు డోలి సహాయంతో తరలించారు. అక్కడ నుండి ఎస్.కోట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గర్భిణిని తరలిస్తున్న కుటుంబ సభ్యులు

హైడ్రో పవర్ ప్రాజెక్టులను రద్దు చేయాల్సిందే..

- రేగులపాలెం, చింతలపూడి బహిరంగ సభల్లో ఏకగ్రీవ తీర్మానం
- ఆదివాసీల, ప్రజల జీవితాలను ఛిద్రం చేస్తారా ?
- ప్రభుత్వంపై సిపిఎం నాయకులు వి.శ్రీనివాసరావు, కె.లోకనాథం ధ్వజం

మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు, వేదికపై లోకనాథం తదితరులు

విల్లంభులు ఎక్కుపెట్టి నిరసన తెలుపుతున్న వి.శ్రీనివాసరావు, లోకనాథం, సురేంద్ర, అప్పలనర్స, గంగరాజు తదితరులు

ప్రజాశక్తి - అనంతగిరి, దేవరాపల్లి విలేకరులు

ఆదివాసీల, ప్రజల జీవితాలను ఛిద్రం చేసే హైడ్రో పవర్ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ అల్లూరి జిల్లా అనంతగిరి మండలం పెదకోట పంచాయతీ రేగులపాలెం, అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం చింతలపూడి ప్రాంతాల్లో సిపిఎం ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన బహిరంగ సభలకు ప్రజలు భారీగా తరలివచ్చారు. తమ బతుకులను ధ్వంసం చేసే ప్రాజెక్టులను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని ఏకగ్రీవ తీర్మానం చేశారు. ప్రభుత్వం తమ మాటను కాదని ముందుకెళ్తే తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. హైడ్రో పవర్ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ రేగులపాలెంలో సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు అధ్యక్షతన, చింతలపూడిలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న అధ్యక్షతన బహిరంగ సభలు జరిగాయి. ఆయా చోట్ల సిపిఎం నేతలకు గ్రామస్తులు ఎక్కడికక్కడ పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. బహిరంగ సభల్లో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ హైడ్రో పవర్ ప్రాజెక్టుల వల్ల ఆదివాసీ ప్రాంతాలు, పర్యావరణం దెబ్బతింటాయన్నారు. ప్రజల జీవనోపాధికి విఘాతం కలుగుతుందని తెలిపారు. హైడ్రో పవర్ ప్రాజెక్టులకు అనుమతులిస్తూ జారీ చేసిన జిఓ 51ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండిగా వ్యవహరిస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు ప్రధాని మోడీ పవన్ కల్యాణ్ చేతిలో చాక్లెట్ పెడితే.. ప్రజల భూములను ఆయన కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు చూస్తున్నారన్నారు. అదానీ ఎక్కడ అడుగుపెట్టినా ఆ ప్రాంతమంతా భస్మీపటలమేనన్నారు. అనంతగిరి మండలంలోని పాఠశాలలకు భవనాలు కరువయ్యాయన్నారు. అక్కడ రేకులషెడ్లలోనే బోధన సాగుతోందని తెలిపారు. పాఠశాలల భవనాలు కట్టడంపై ప్రభుత్వం శ్రద్ధ వహించకుండా అదానీకి హైడ్రో పవర్ ప్రాజెక్టుల కోసం భూములు అప్పగించడానికి మాత్రం ఉరకలు వేస్తోందన్నారు. కొండలు, పచ్చని పంటలతో ఉన్న ప్రాంతాలన్నీ అదానీ చేతిలో పడితే మాడిమసైపోతాయన్నారు. ప్రజలంతా ఐక్యంగా ఉండి హక్కులను, భూములను కాపాడుకోవాలన్నారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతుంటే, ఆ విషయాన్ని పక్కనపెట్టి అదానీకి భూములు కట్టబెట్టడానికి ప్రభుత్వం చూస్తోందని తెలిపారు. ఎన్నికలకు ముందు నాయకులు ప్రజలకు మాయమాటలు చెప్పి, గద్దెనెక్కిన తర్వాత ప్రజల నడ్డి విరుస్తున్నారని అన్నారు. గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా హైడ్రో పవర్ ప్రాజెక్టులకు ఎలా అనుమతులిస్తారని ప్రశ్నించారు. పెదకోట, మారిక, చింతలపూడి గిరిజనులను ప్రభుత్వం మోసం చేస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. అదానీ స్మార్ట్ మీటర్లు పెట్టి ప్రజలపై విద్యుత్ భారాలు మోపేందుకు ప్రభుత్వం చూస్తోందన్నారు. దీనికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఆయా చోట్ల జరిగిన బహిరంగ సభల్లో సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, అల్లూరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బిసిహెచ్.పడాల్, పోతురాజు, వి.ఉమామహేశ్వరరావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్, సిపిఎం అనంతగిరి మండల కార్యదర్శి మొస్య, నాయకులు సోమెల నాగులు, పెదకోట ఎంపిటిసి శిరగం శ్రావణి, సర్పంచ్ శిరగం అన్నపూర్ణ, అనంతగిరి మహిళా సంఘం నాయకులు దీసరి దేముడమ్మ, పీసా కమిటీ సభ్యులు నారంగి సింహాచలం, గొల్లోరి ఆనంద్, బంగారు నాయుడు, సప్పి దేముడు, సోమెల దేముడు, దేవయ్య, సిపిఎం దేవరాపల్లి మండల కార్యదర్శి బిటి.దొర, సర్పంచులు, దమ్మంగి బోడెమ్మ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడిలో ప్రాజెక్టుకు వ్యతిరేకంగా నినదిస్తున్న ప్రజానీకం

పిఒ క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

మహిళా ఉద్యోగులపై దురుసుగా ప్రవర్తించిన ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -రంపచోడవరం : మారేడుమిల్లి మండలం వేటుకూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం, వార్డెన్ పట్ల మారేడుమిల్లి ఎస్‌ఐ విచారణ పేరుతో మహిళా ఉద్యోగులు అని కూడా చూడకుండా అభ్యంతరకరంగా, దురుసుగా ప్రవర్తించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణ తెలిపారు. సదరు ఎస్‌ఐ గతంలో కూడా మారేడుమిల్లిలో పనిచేస్తున్న ఒక మహిళా ఉపాధ్యాయురాలిని కూడా రాత్రి 10 గంటల సమయంలో విచారణ పేరుతో స్టేషన్‌కు పిలిపించి అభ్యంతరకరంగా మాట్లాడిన విషయం ఈ సందర్భంగా గుర్తు చేశారు. గురువారం యుటిఎఫ్ జిల్లా కమిటి రంపచోడవరం ఐటిడిఎ పిఒ క్యాంపు కార్యాలయంలో ఎస్‌ఐపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రాజెక్ట్ ఆఫీస్ క్యాంపు కార్యాలయం లో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శులు కె.ఆదిరెడ్డి, కె.సూరిబాబు, ఎఫ్‌డబ్ల్యూఎస్ జిల్లా సహాధ్యక్షులు డి.మహేష్, రంపచోడవరం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సనాతన బాబు, వెంగళరావు, పండయ్య పాల్గొన్నారు.

శ్రీనివాసరెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎపి జెన్‌కో అధికారులు

ఎపి జెన్‌కో ఇఇ శ్రీనివాసరెడ్డికి ఎస్‌ఇగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరు కాంప్లెక్స్ పరిధి సీలేరు ఎపి జెన్‌కో సివిల్ విభాగంలో ఇఇగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరెడ్డిని ఎస్‌ఇ సివిల్‌గా ఎపి జెన్కో ఉన్నతాధికారులు ఉద్యోగో న్నతి కల్పిస్తూ విజయవాడ ఎపి జెన్‌కో విద్యుత్ సౌదాకి బదిలీ చేశారు. ఈ క్రమంలో స్థానిక ఎపి జెన్కో అతిథిగృహంలో వీడ్కోలు కార్యక్రమాన్ని జెన్‌కో అధికారులు గురువారం నిర్వహించారు. ఇఇ శ్రీనివాస్‌రెడ్డి దంపతులకు సీలేరు కాంప్లెక్స్ ఎస్‌ఇ సివిల్ చంద్రశేఖర్‌రెడ్డి ఇఇలు రాజేంద్రప్రసాద్, వరప్రసాద్, భాస్కర్‌రావు బొకేలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ శ్రీనివాసరెడ్డి ఉద్యోగోన్నతి పొందడం శుభ పరిణామం అన్నారు. సివిల్ విభాగంలో గత ఏడాది అక్టోబర్‌లో ఇఇగా సీలేరులో బాధ్యతలు చేపట్టి 10 నెలలు ఎంతో నిబద్ధతతో విధులు నిర్వహించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంపు స్టోరేజ్ ప్రాజెక్టు ఎడిఇ అప్పలనాయుడు ఎఇ సి.హెచ్.సురేష్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు. ఇన్‌చార్జి ఇఇగా జైపాల్, ఎపి జెన్కో సివిల్ విభాగంలో ఎడిఇగా విధులు నిర్వహిస్తున్న జైపాల్‌కు ఇన్‌చార్జ ఇఇ సివిల్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీలేరు కాంప్లెక్స్ మోతుగూడెం చీఫ్ ఇంజనీర్ రాజయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఇఇగా ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్ నాగమణి

15వ ఆర్థిక సంఘ నిధులు వెంటనే విడుదల చేయాలి

ప్రజాశక్తి-కూనవరం: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మండలంలోని పంచాయతీల సర్పంచుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని పంచాయతీల్లో 15వ ఫైనాన్స్ నిధులు పెండింగ్ ఉండడం వల్ల కనీసం బోర్లు మరమ్మతులు చేయించాలన్నా ఇబ్బందిగా ఉందని వర్షాకాలంలో పంచాయతీల్లో పారిశుధ్య పనులు చేయాలన్నా కనీసం బ్లీచింగ్ కొనే పరిస్థితి కూడా లేదని సర్పంచులు అందరూ ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దారుకూరు సర్పంచ్ నాగమణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సర కాలంలో అయినా ఇంతవరకు పంచాయతీలకు రావాల్సిన నిధులను ఇంతవరకూ విడుదల చేయలేదని, స్థానిక సంస్థలను బలోపేతం చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. పంచాయతీ నిధులు తక్షణమే విడుదల చేయాలని లేని పక్షంలో ప్రత్యక్ష పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల సర్పంచులు పాల్గొన్నారు.

సమస్యను వివరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

డిగ్రీ కళాశాల వసతిగృహాన్ని ప్రారంభించాలి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకులోయ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నూతనంగా నిర్మించిన వసతి గృహం ప్రారంభించి వసతి సౌకర్యాలు కల్పించాలని అసిస్టెంట్ కలెక్టర్ అసిస్టెంట్ కలెక్టర్ కనల చిరంజీవి నాగ వెంకట్ సాహిత్ కు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.రామన్న, ఎస్‌ఎఫ్‌ఐ మాజీ డివిజన్ నాయకులు కె రామారావు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు ఎదుర్కొంటున్న సమస్యపై అసిస్టెంట్ కలెక్టర్ కు వివరించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వసతి సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీంతో కో ఎడ్యుకేషన్ డిగ్రీ కళాశాల వసతిగృహం సుమారు కిలోమీటర్ దూరంకు విద్యార్థినిలు ప్రతీ రోజు కాలినడకతో వెళ్లి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. ఉదయం, సాయంత్రం భోజనం చేయడానికి గాలి వర్షం వచ్చినా తడుచుకుంటూ వెళ్లవలసిన పరిస్థితి వస్తుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. తక్షణమే మహిళ డిగ్రీ కళాశాల వసతిగృహం ప్రారంభించి వసతి సౌకర్యాలు కల్పించాలని కోరారు. స్పందించిన అసిస్టెంట్ కలెక్టర్ మహిళా డిగ్రీ కాలేజీ వసతి గృహం అతి త్వరలోనే ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

దారి లేక ప్రాణాలు విడిచిన గిరిజనుడు

-వర్షాలకు మూడు రోజుల క్రితం కొట్టుకుపోయిన వంతెన

-గుండెపోటుతో ఆకస్మికంగా ఇంటి వద్దనే మృతి

పజాశక్తి-జీకే వీధి : మండలంలోని జెర్రిల కొత్తూరు గ్రామంలో సోమవారం భారీగా కురిసిన వర్షానికి తాత్కాలికంగా నిర్మించుకున్న వంతెన కొట్టుకుపోవడంతో ఆసుపత్రికి తరలించేదుకు దారి ఓ వ్యక్తి మృతి చెందాడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయానికి వస్తే బుధవారం గ్రామంలో లోత బాలరాజు 40 అనే వ్యక్తికి గుండెపోటు రావడంతో గ్రామస్తులు ఆసుపత్రికి తరలించాలని చాలా ప్రయత్నాలు చేశారు. వంతెన కొట్టుకుపోవడంతో అంబులెన్స్ వాహనం గ్రామంలోకి రాలేక పోయింది. ఏదో మార్గంలో ఆసుపత్రికి తరలించాలని ఆలోచన చేశామని, ప్రయత్నించగా అంతలోనే ఆ వ్యక్తి ప్రాణం విడిచాడని కుటుంబ సభ్యులు అన్నారు. గ్రామంలో అత్యవసర పరిస్థితి వస్తే ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి గ్రామానికి రహదారి, బ్రిడ్జి సౌకర్యం కల్పించాలని కోరారు.

బాలరాజు మృతదేహం

ముఖ్యమంత్రి దృష్టికి ఆర్‌అండ్‌ఆర్ సర్వే

ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

ప్రజాశక్తి - వి.ఆర్.పురం: వి.ఆర్.పురం మండలం రేఖపల్లి ఎస్సీ కాలనీకి చెందిన గ్రామస్తులు పోలవరం ఆర్‌అండ్‌ఆర్ జాబితాలో తమను చేర్చాలని విఆర్‌పురం మండల సొసైటి అధ్యక్షుడు, సీనియర్ టిడిపి నాయకులు గొంది చంద్రయ్య, టిడిపి నాయకులు మామిడి రాజు బాబు ఎమ్మెల్యే శిరీషదేవికి గురువారం వినతిపత్రం అందించారు. పోలవరం బ్యాక్ వాటర్ సర్వే లో భాగంగా బ్యాక్‌వాటర్ ఎక్కడ వరకు వస్తుంది అని గతంలో ఒక సర్వే నిర్వహించారని దీనికి సంబంధించి కొన్ని ఆర్‌ఎఫ్‌ఎల్ (రిజర్వ్ ఫ్లడ్ లెవెల్) స్టోన్స్ వేశారని అక్కడి వరకు పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావం ఉంటుందని ఆ పరిధిలోనే రేఖపల్లి పంచాయతీలోని ఎస్సీ కాలనీ హ్యాబిటేషన్‌కు చెందిన ఇళ్ళు ఉన్నాయని ఎమ్మెల్యే శిరీషదేవికి వివరించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ ద్వారా ఫిర్యాదు చేశామన్నారు. 2022లో వరదలకు రేఖపల్లి ఎస్సీ కాలనీ హ్యాబిటేషన్‌కు చెందిన అన్ని ఇళ్లు వారం రోజులపాటు నీటిలోనే ఉన్నాయని ఆమెకు తెలిపారు. తక్షణమే ఆర్‌అండ్ సర్వే నిర్వహించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే శిరీష ఆర్‌అండ్‌ఆర్ సర్వే చేసి పునరావాసం కల్పించే దిశగా నేరుగా సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్తామని నిర్వాసితులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ కాలనీ హాబిటేషన్ నిర్వాసితులు చీమల వెంకన్నబాబు, గోలి సత్తిబాబు, పెదపెట్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శిరీషదేవికి వినతిపత్రం అందిస్తున్న టిడిపి నాయకులు

పేదరిక నిర్మూలనకు పి4 కార్యక్రమం

మాట్లాడుతున్న కార్యదర్శి పరశురాం

ప్రజాశక్తి -సీలేరు: పేదరిక నిర్మూలనకు పి 4 కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని సర్పంచ్ పాంగి దుర్గో తెలిపారు. జికెవీధి మండలం సీలేరు సచివాలయంలో గురువారం కార్యదర్శి పరసరం అధ్యక్షతన పి 4 గ్రామసభ నిర్వహించారు.

కార్యక్రమానికి సర్పంచ్ పాంగిదుర్గో ఎంపిటిసి పిల్ల సాంబమూర్తి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదకుటుంబాలను బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గుమస్తా ప్రకాష్, ఉప సర్పంచ్ వల్లిప్రసాద్ కూటమి నాయకులు బొర్రా కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గుర్తేడును మండల కేంద్రంగా ప్రకటించాలి

ప్రజాశక్తి-వై.రామవరం : కూటమి ప్రభుత్వం వచ్చి మండలంలో ఎక్కువ ఉన్న గ్రామాలను గుర్తించి, కొత్త మండలాలుగా ఏర్పాట్లకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో, గుర్తేడు మండల కేంద్రంగా ప్రకటించాలని అప్పర్‌పార్ట్‌లో ఉన్న ఆరు పంచాయతీల ప్రజలు కోరు కుంటున్నారని గుర్తేడు సర్పంచ్ తెలిపారు. వై.రామవరం మండలం రెండుగా విభజిస్తే గుర్తేడును మండల కేంద్రంగా చేయాలని, మండలంలో అధిక జనాభా గల గ్రామం కాబట్టి డొంకరాయి కాని, బొడ్డగండిని మండల కేంద్రంగా చేస్తే, గుర్తేడు ప్రజలు అనేక ఇబ్బందులు పడతారని గుర్తేడును మండల కేంద్రంగా చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారన్నారు.

పశువులు అక్రమ రవాణా చేస్తున్న వాహనం సీజ్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాన్ని రాజవొమ్మంగి పోలీసులు గురువారం సీజ్ చేశారు. ఎస్‌ఐ నరసింహామూర్తికి అందిన సమాచారం మేరకు, స్థానిక అల్లూరి జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆటోలో పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న అడ్డతీగల గ్రామానికి చెందిన వేమవరపు రాజు అను వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరసింహామూర్తి తెలిపారు.

సిహెచ్‌సిలుగా గుర్తించాలి

ప్రజాశక్తి -సీలేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం సీలేరు, దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సి. హెచ్ సిలు గా ప్రభుత్వ అధికారులు గుర్తించాలని అల్లూరి జిల్లా కాంగ్రెస్ డీసీసీ కార్యదర్శి కారే శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో గురువారం మాట్లాడుతూ ఈ ప్రాంతానికి 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న చింతపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను ఏహెచ్‌ఏరియా ఆసుపత్రిని 100 పడకల ఆస్పత్రిగా అప్డేట్ చేస్తూ ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందేఅని మారుమూల ప్రాంతంలో ఉన్న దారకొండ, సీలేరు పిహెచ్‌సిలో ఏదో ఒకటి సిహెచ్‌సిగా ప్రకటిస్తే వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయితీ మంగంపాడు, సీలేరు, దారకొండ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆర్‌వి నగర్ నుంచి పాలగెడ్డ వరకూ రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో మెరుగైన వైద్యసేవలు నిమిత్తం వెళ్లాలంటే తలకు మించిన భారంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు పిహెచ్‌సిలో ఏదో ఒక దానిని సిహెచ్‌సిగా అప్‌గ్రేడ్ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

క్షయవ్యాధి నివారణపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న టిబి విభాగం సూపర్ వైజర్ అశోక్

ప్రజాశక్తి-జీకేవీధి:మండలంలోని రింతాడ సబ్ సెంటర్‌లో రింతాడ జిటిడబ్ల్యూ గర్ల్ హాస్టల్‌లో టీబీ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.టిబి సూపర్ వైజర్ అశోక్ మాట్లాడుతూ, ఎవరికైనా 2వారాలు మించి దగ్గు, రోజు విడిచి రోజు జ్వరం, బరువు తగ్గిపోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేసుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా 6నెలలు మందులు వాడాలన్నారు. ప్రభుత్వం మందులు వాడుతున్న రోగులకు, పోషక ఆహారం కోసం రూ.6000 అందిస్తుందన్నారు. ఈ వ్యాధి రాకుండా బీసీజీ టీకాను వేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ టిబి వ్యాధిపై అవగాహన కలిగి వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సూపర్ వైజర్ అశోక్, ఎల్ టి ఎస్ రావు, ఎమ్మెల్ హెచ్ పి నిర్మలా, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కెజిబివిలో ఆకస్మిక తనిఖీలు

పరిశీలిస్తున్న ప్రాజెక్టు కో ఆర్డినేటర్

ప్రజాశక్తి- హుకుంపేట: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ స్వామి నాయుడు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులకు అందుతున్న మెనూ, వంట గది, , కూరగాయల నిల్వ గదులు (స్టాక్ రూమ్)ను గమనించి సూచనలు ఇచ్చారు. అనంతరం, విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు, బోధన పద్ధతులు తదితర అంశాలపై సమాచారం సేకరించారు. విద్యార్థుల విద్యా స్థాయిని మెరుగు పరచాలని ఉపాధ్యాయులకు మార్గనిర్దేశం చేశారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచేలా బోధన కొనసాగించాలని సూచించారు. నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన భోజనాలు కూడా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ అనిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు న్యాయవాదుల మహా ధర్నా

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మధ్యాహ్నం 11 గంటలకు న్యాయవాదులు మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర పరిపాలన అధ్యక్షుడు కెఎస్ఎస్ సురేష్ కుమార్ తెలిపారు. విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు, న్యాయవాదుల చట్ట సవరణ, మరణానంతరం కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల చెల్లింపు, జనాభా నిష్పత్తి ప్రాతిపదికన న్యాయమూర్తుల భర్తీ, అర్హులైన న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు, నూతన జూనియర్ న్యాయవాదుల ఆర్థిక సహాయాన్ని రూ.పదివేలకు పెంపు వంటి 11 డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని కోరుతూ మహాధర్నా చేస్తున్నామన్నారు. న్యాయవాదులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అరకు- విశాఖ రహదారి అధ్వానం !

- నిండా గోతులమయమై వాహన రాకపోకలకు అవస్థలు

సుంకరమెట్ట సమీపంలో బురదమయంగా ఉన్న రోడ్డు

ప్రజాశక్తి-అరకులోయ:ప్రభుత్వాలు మారినా ఏజెన్సీ ప్రాంతంలోని రహదారుల పరిస్థితి మాత్రం మారడం లేదు. ఈ ప్రాంతంలో రహదారుల నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించకుండా రోడ్లు నిర్మిస్తుండడంతో వేసిన కొద్ది రోజులకే అవి మొదటి స్థితికి చేరుకుంటుంది. దీనికి అరకు -విశాఖ ప్రధాన రహదారి తార్కాణంగా పేర్కొనవచ్చు. ఇటీవల కాలంలోనే అరకు విశాఖ ఘాట్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. అయితే ఇందులోత నాణ్యత ప్రమాణాలు లోపించడంతో రోడ్డు వేసిన కొద్ది నెలలకే అనేక చోట్ల గోతులమయమై ప్రయాణికులను పర్యాటకులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. గత ప్రభుత్వ హయం నుంచి ఘాట్ రోడ్డులో రంధ్రాలు పూడ్చాలని ఎన్నిసార్లు ప్రయాణికులు సంబంధిత అధికారులకు విన్నవించిన పట్టించుకునే నాధుడే కరువయ్యారు. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా రంధ్రాలు లేని రహదారి చేయడమే లక్ష్యమని ప్రకటించినప్పటికీ ఇక్కడ మాత్రం ఆచరణ రూపం దాల్చలేదు. అరకు లోయకు సమీపంలోని సుంకరమెట్ట కాఫీ తోట, యు పాయింట్ దగ్గర గల అరకు విశాఖపట్నం రహదారి రోడ్డులో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి వర్షపు నీరు నిల్వ ఉంటుంది . నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో గోతులు మాయమవడంతో ప్రయాణికులు వాహన చోదకులు అనేకమార్లు ప్రమాదాల బారిన పడుతున్నారు. అయినప్పటికీ రోడ్డు పనులు చేపట్టిన కాంట్రాక్టర్, అధికారి యంత్రం గాని పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వర్షపు నీటితో నిండి ఉండడంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఇంతే కాకుండా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రమాదకరంగా మారిన ఈ రహదారిలోని గోతులు వెంటనే పూడ్చివేయాలని వాహన చోదకులు పర్యాటకులు ప్రయాణికులు కోరుతున్నారు.

నిండా గోతులతో నీరు నిలిచిన ఘాట్ రోడ్డు

స్వచ్ఛ భారత్‌పై కళాజాతా

స్వచ్ఛ భారత్‌పై కళాజాతా

ప్రజాశక్తి పాడేరు టౌన్: మన ఊరి పరిశుభ్రత మన అందరి బాధ్యతని దేవాపురం సర్పంచ్ కె.పరమేశ్వరి అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో కళాజాత బందం దేవాపురం ఎంపిపి పాఠశాల వద్ద గురువారం కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ రహిత జీవనం, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలన వివిధ అంశాల గురించి ప్రజలకు వివరించారు. కళాజాత బృందం వారు జానపద గీతాల ద్వారా ఇంటింటా చెత్త సేకరణ, తడి పొడి చెత్త వేరు చేయుట, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, బాల్యవివాహాలు అరికట్టుట, ప్లాస్టిక్ నిషేధం, దోమల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఎంఎల్ హెచ్ పి దేవి, ఎఎన్ఎం ఎలిజబెత్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలకు వ్యాక్సినేషన్

ప్రజాశక్తి-జీకే వీధి:మండలంలోని దామనపల్లి, కట్టుపల్లిలో పశువైద్యాధికారి లోకుల రమేష్ ఆధ్వర్యంలో పశువైద్యశిబిరం నిర్వహించారు. మేకలు, గొర్రెలు, ఆవులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మేకలకు, గొర్రెలకు టీకాలు వేసి మందులను పంపిణీ చేశారు. వర్షాల సీజన్‌లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పాడిరైతులు, జీవాల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని, మూగజీవాలకు ఎటువంటి అనారోగ్యం వచ్చినా వెంటనే సమీపంలో పశువైద్యకేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పరిసర గ్రామాల రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జీవాలకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్యసిబ్బంది

పాఠశాల నిర్మాణం పూర్తి చేయాలి

సిపిఎం నేతలు శ్రీనివాసరావు, లోకనాథం

పాఠశాలను పరిశీలిస్తున్న సిపిఎం నేతలు శ్రీనివాసరావు, లోకనాథం

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని ఓల్డా పంచాయతీ పరిధిలోని పెడిరాయి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను పూర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు కె. లోకనాథం డిమాండ్ చేశారు. పాఠశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, 2020-21లో 'నాడు-నేడు' రెండవ విడతలో మంజూరైన రూ. 25 లక్షల నిధుల్లో కేవలం రూ. 10 లక్షలు మాత్రమే ఖర్చు చేసి, మిగిలిన నిధులు నిలిపివేయడంతో పాఠశాల భవనం నిర్మాణం మధ్యలోనే ఆగిపోయిందని తెలిపారు. వర్షాకాలంలో రేకుల చెడ్డులో చదవడంతో విద్యార్థులకు తీవ్ర ఇబ్బందిగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే మిగిలిన నిధులను విడుదల చేసి, నిలిచిన పాఠశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి పీ.అప్పలనర్స, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బిసిహెచ్ పడాల్, వి. ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

సోలార్ లైట్లు పంపిణీ

లైట్లు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ చైర్మన్ సతీష్

ప్రజాశక్తి-అరకు లోయ:విద్యుత్ సౌకర్యానికి నోచుకోని గిరిజన గ్రామాలను గుర్తించి ఉచితంగా సోలార్ లైట్లు పంపిణీ చేస్తున్నట్లు సోషియో ఎకనామిక్ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్ అన్నారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనంతగిరి మండలం రొంపిల్లి పంచాయితీలోని గ్రామాల్లో విద్యుత్ సోలార్ లైట్లు గిరిజనులకు పంపిణీ చేసినట్లు ఆయన అన్నారు. అనేక గిరిజన గ్రామాల్లో ఇప్పటికీ విద్యుత్ వెలుగుకు నోచుకోకపోవడం పాలకుల నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే విద్యుత్, రోడ్, మంచినీరు సదుపాయం కల్పించాలని కోరారు.

26న 'చిత్ర' గీతాలతో సినీ సంగీత విభావరి

ప్రజాశక్తి- సీతమ్మధార : సినీ నేపథ్య గాయని చిత్ర పుట్టినరోజు సందర్భంగా ఈనెల 26న సాయంత్రం ఆరు గంటలకు ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో గాయని చిత్ర సినీ గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్టు ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు తెలిపారు. గురువారంసంబంధిత పోస్టర్‌ను మేయర్ పీలా శ్రీనివాసరావు ఆవిష్కరించారు.

మొక్కలు నాటుతున్న సిఆర్‌పిఎఫ్ సిబ్బంది

పర్యావరణాన్ని పరిరక్షించండి

ప్రజాశక్తి - వై.రామవరం : మార్కెట్లో ఉన్న గిరిజన సంక్షేమ పాఠశాలలో పార్ట్ టు బెటాలియన్, సిఆర్‌పిఎఫ్ ఆధ్వర్యంలో, గురువారం పండ్లతోటల మొక్కలు నాటారు. మొక్కలు నాటడం వలన, విద్యార్థులు మంచి వాతావరణానికి అలవాటు పడడంతో పాటు, ఆరోగ్యంగా ఉంటారని సిఆర్‌పిఎఫ్ కమాండర్ రాధా అన్నారు. స్కూల్ హెచ్ఎం లక్ష్మణ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సిఆర్‌పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు

పెంచిన విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలి

- సిపిఐ నిరసన

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం సర్దుబాటు చార్జీల పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు ఉపసంహరించు కోవాలని, అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కంచరపాలెంమెట్టు వద్ద సిపిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పాత్రపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్‌ఛార్జీలు పెంచి ప్రజలు నడ్డి విరుస్తోందని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయడానికి వస్తే ప్రజల వాటిని పగలగొట్టాలని పిలుపునిచ్చారని మరి ఇప్పుడు కూటమి ప్రభుత్వం వీటిని అమలు చేస్తోందని, దీనికి చంద్రబాబు, లోకేష్ ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ సంవత్సర కాలంలో నాలుగు సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిరూ.15,486 కోట్ల భారాన్ని రాష్ట్రప్రజలపై మోపారని దుయ్యబట్టారు. సోలార్ విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లాకార్యవర్గ సభ్యులు నెయ్యల నాగభూషణరావు, సిపిఐ కంచరపాలెంశాఖ కార్యదర్శి వాసుపల్లి మల్లయ్య, ప్రజానాట్యమండలి నాయకులు నెలవాడ అప్పన్న, ఆడారి ఆదినారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.

ఏసర్ 'ఈబైక్ గో' అవుట్‌లెట్ ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఏసర్ అధికారిక లైసెన్స్ పొందిన,భారతదేశంలో అత్యంత ఫార్వర్డ్ థింకింగ్ ఎలక్ట్రిక్ మొబిలిటీ స్టార్టప్‌లలో ఒకటైన ఈబైక్ గో ప్రైవేట్ లిమిటెడ్ విశాఖపట్నంలో కొత్త ఏసర్ ఎలక్ట్రిక్ వెహికల్స్ రిటైల్ అవుట్‌లెట్‌ను గురువారం రైల్వేన్యూకాలనీ డాక్టర్ అవెన్యూ, శ్రీసిద్ధి ఎన్ క్లేవ్‌సంస్థ సహవ్యవస్థాపకులు, సిఇఒ శ్రీహరి కిరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక ఏసర్-బ్రాండెడ్ ఎలక్ట్రిక్ వాహనాలను విశాఖలో ఏర్పాటు చేశామని ఏసర్-బ్రాండెడ్ ఎలక్ట్రిక్ వాహనాలు నగర ప్రజలకు అందించడమే ఈబైక్‌గో లక్ష్యం అన్నారు. ఈ-సైకిళ్ల ధర రూ35,999 నుండి ప్రారంభమవుతుందన్నారు.

ఉన్నత చదువులకు ఛారిటీ బాక్స్ ఆర్థికసాయం

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్ : ఇద్దరూ ఆడపిల్లలే పుట్టారన్న కారణంతో భర్త నిరాదరణకు గురైన ఓ మహిళ తన పిల్లల ఉన్నత చదువుల కోసం 'చారిటీ బాక్స్' సంస్థను ఆశ్రయించింది. తమ సంస్థ తరపున రూ.50 వేలు ఆర్థిక సాయం అందించినట్టు చారిటీ బాక్స్ కోశాధికారి పొట్నూరు వెంకట శివప్రసాద్ తెలిపారు. పెద్దకుమార్తె బిఎస్సి నర్సింగ్, రెండో అమ్మాయి హోటల్‌మేనేజ్‌మెంట్ చదువుతున్నారని, వీరి చదువుల నిమిత్తం మొదటి విడత రూ.50వేల చెక్కు అందజేశారు. చారిటీ బాక్సు ప్రతినిధి పొట్నూరు వెంకట రమణ మాట్లాడుతూ అట్టడుగున ఉన్న వారికి అండగా నిలవడమే చారిటీ బాక్సు లక్ష్యమన్నారు. కార్యక్రమంలో లక్కోజు నూకరాజు పాల్గొన్నారు. పెదవాల్తేరులో ఉన్న పట్టణ నిరాశ్రయుల వసతి గృహానికి చారిటీ బాక్సు ఆధ్వర్యంలో ఒక ఫ్యాన్ అందజేయడం జరిగింది. హోంమేనేజర్ వినతి మేరకు ఫ్యాన్ అందించామని చారిటీ బాక్స్ ప్రతినిధులు తెలిపారు.

జివిఎంసి ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడండి

మేయర్ పీలా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: జివిఎంసి ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు జివిఎంసి పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి ప్రభాకర్‌తో కలిసి ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జివిఎంసి ఆస్తులు ఆక్రమణకు గురికాకుండా కాపాడాల్సిన బాధ్యత పట్టణ ప్రణాళిక అధికారులపై ఉందని తెలిపారు. జివిఎంసి పరిధిలో జోనల్ వారీగా ఎన్ని ఖాళీ స్థలాలు, పార్కులు ఉన్నాయని, వాటిలో ఆక్రమణకు గురైన స్థలాలు, కోర్టుకేసులు తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని జోన్లలో కలిపి 48 కోర్టు కేసులకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కోర్టుకేసులు ఉన్న స్థలాల యొక్క డాక్యుమెంటేషన్ సరైన పద్ధతిలో కోర్టులో ప్రవేశపెట్టడం ద్వారా ఆయా స్థలాలను మనం కాపాడుకోగలుగుతామని పేర్కొన్నారు. జివిఎంసి పరిధిలో ఉన్న ఖాళీస్థలాల పరిరక్షణకు ఆయా జోనల్ అధికారులు బాధ్యత తీసుకుని పరిరక్షించాలన్నారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నం దున చాలావరకూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఫుట్‌పాత్ ఆక్రమణలను వెంటనే తొలగించాలని మేయర్ ఆదేశించారు. అనంతరం జివిఎంసి కమిషనర్ మాట్లాడుతూ ఆస్తుల పరిరక్షణకు పట్టణ ప్రణాళిక అధికారులు కృషి చేయాలని, ఖాళీ స్థలాలు, పార్కులు ఆక్రమణ జరగకుండా కాపాడాలని, కోర్టు కేసులో ఉన్న స్థలాల యొక్క వివరాల తోపాటు ఆక్రమణ జరిగిన ప్రాంతాల యొక్క ఫొటోలు మేయర్ తో కలిసి పరిశీలించడం జరిగిందని తెలిపారు. ఫుట్‌పాత్‌లు, రోడ్లు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. రోడ్డుపై రాళ్లు,ఇసుక, సిమెంటు వేసేవారి నుండి అపరాధ రుసుము వసూలు చేసి వెంటనే డెబ్రిస్‌ను తొలగించాలని ఆదేశించారు. ఆక్రమణలపై చాలా ఫిర్యాదులు వస్తున్నందున ఆక్రమణలపై ప్రత్యేకదృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. లే అవుట్‌లలో జివిఎంసి అనుమతులు లేకుండా పార్కులు, జిమ్ లు, ఆటస్థలాలు ,టెన్నిస్‌కోర్టు లాంటివి ఏర్పాటు చేసి ఫీజులు వసూలు చేసే వాటిని గుర్తించి వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. సిటీ ప్లానర్ లు మీనాకుమారి, ధనుంజయరెడ్డి, డిసిపిలు హరిదాసు, రామ్మోహన్, ఎసిపిలు, టిపిఓలు ఇతర పట్టణ ప్రణాళిక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

బ్లాక్ చెయిన్ యాత్రను ప్రారంభిస్తున్న సంస్థ ప్రతినిధులు

విశాఖ నుంచి బినాన్స్ బ్లాక్‌చెయిన్ యాత్ర ప్రారంభం

ప్రజాశక్తి , ఎంవిపి కాలనీ : ప్రపంచంలోని ప్రముఖ బ్లాక్‌చెయిన్ పర్యావరణ వ్యవస్థ, వర్చువల్ డిజిటల్ ఆస్తి మార్పిడి సంస్థ యొక్క బినాన్స్, బ్లాక్ చెయిన్ యాత్ర 2025ను బుధవారం విశాఖపట్నం నుండి ప్రారంభించింది. ఈ సందర్భంగా రికార్డెంట్ సహ వ్యవస్థాపకుడు మరియు సిఇఒ విన్నీ పాత్రో మాట్లాడుతూ ఈ బ్లాక్‌చెయిన్ యాత్ర ద్వారా పర్యావరణ వ్యవస్థపై అవగాహన, విద్య, అందిచడంతో పాటు ఈ రంగంలో విజయంసాధించడానికి అవసరమైన కీలక నైపుణ్యాలు, కమ్యూనిటీ ఆధారిత వృద్ధి ప్రాముఖ్యత, వ్యవస్థాపకులు సమ్మిళిత, స్థిరమైన పర్యావరణ వ్యవస్థలను ఎలా పెంపొందించుకోవచ్చో వక్తలు చర్చిస్తామని ప్రస్తుతం బ్లాక్చెయిన్ నుండి ఏఐ, వికేంద్రీకత మౌలిక సదుపాయాల వరకు, ఆవిష్కరణ వేగం వేగవంతమవుతోందన్నారు. డెవలపర్లు, వ్యవస్థాపకులకు మాత్రమే కాకుండా, మనం ఎలా జీవిస్తున్నాం, పని చేస్తామని, అంశాల ద్వారా భవిష్యత్తును రూపొందించాలని చూస్తున్న ఎవరికైనా తాము ప్రోత్సహాన్ని అందిస్తామన్నారు.

కేన్సర్ రోగికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నోటి క్యాన్సర్‌తో బాధపడుతున్న 36వ వార్డుకు చెందిన జోహార్ బేగం అనే మైనార్టీ మహిళకు మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. స్థానిక వైసిపి నేతల ద్వారా విషయం తెలుసుకుని గురువారం ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించారు. తక్షణమే సొంత నిధులు రూ.10వేలను వైద్యఖర్చులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దక్షిణ నియోజకవర్గం ముస్లిం మైనారిటీలతో విడదీయరాని బంధం ఏర్పడిందని,వారిలో ఒక కుటుంబ సభ్యుడిగా సహాయం అందించానని తెలిపారు. క్యాన్సర్ నుండి కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో జీవితం గడపాలని ఆమెకు ధైర్యం చెప్పారు. కార్పొరేటర్ చెన్నా జానకిరామ్, వైసిపి వార్డు అధ్యక్షుడు మహమ్మద్ షకీల్,సౌత్ మేధావుల విభాగం అధ్యక్షుడు పిల్లా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళకు నగదు అందిస్తున్న వాసుపల్లిగణేష్‌కుమార్

విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తల్లికి వందనం, పోస్ట్‌మెట్రిక్ స్కాలర్షిప్ లను త్వరితగతిన విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పిడిఎస్ఒ) ఆధ్వర్యంలో గురువారం ఆర్టిసి కాంప్లెక్స్ నుండి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, అనంతరం గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో పిడిఎస్ఒ విశాఖ జిల్లా అధ్యక్షుడు పి.విశ్వనాథ్ మాట్లాడుతూ,గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని విద్యార్థులు లేదా వారి తల్లిదండ్రుల అకౌంట్లో జమ చేస్తామని ప్రకటించి, విడతల వారీగా కొంత మొత్తాన్ని జమ చేయటం జరిగిందన్నారు. అయితే విడుదల చేయాల్సిన మొత్తం ఇంకా కోట్ల రూపాయల లో పెండింగ్‌లో ఉందన్నారు. నేడు అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఈ పద్ధతి లో మార్పులు చేర్పులు చేసి ఈ మొత్తాన్ని డైరెక్ట్‌గా కాలేజీ అకౌంట్లోకి వేస్తామని ప్రకటించారన్నారు. మొత్తంగా రెండేళ్లకు రూ. 7,800 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉండగా ఇప్పటికి కేవలం రూ.1,400 కోట్లు మాత్రమే విడుదల చేసిందన్నారు. ఇంకా రూ.6400 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రతి ఒక్క విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని, ఇష్టం వచ్చిన ప్రైవేటు కాలేజీలో ధనిక విద్యార్థులతో సమానంగా చదివే అవకాశాన్ని కల్పిస్తున్నామని చెప్పారని ఇప్పుడు ఫీజ్‌రీయింబర్స్‌మెంట్ ఎగ్గొట్టేందుకు చూస్తున్నారని ఆరోపించారు. పిడిఎస్ఒ జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి, మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే ఎటువంటి బకాయిలు లేకుండా ఫీజ్‌రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిడిఎస్ఒ సభ్యులు జానకి, ఢిల్లీ ప్రణయ్ పాల్గొన్నారు.

రికవరీ నగదు బాధితులకు అందిస్తున్న కమిషనర్ డాక్టర్ శంఖబ్రాత బాగ్చి

రూ.1.6 కోట్ల సొత్తు రికవరీ

ప్రజాశక్తి , ఎంవిపి కాలనీ : విశాఖ పోలీస్ కమిషనరేట్‌లో 2025 జూన్ నెల రికవరీమేళాను గురువారం నగరపోలీస్ కమిషనరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పోలీస్‌కమిషనర్ డా.శంఖబ్రాత బాగ్చి మాట్లాడుతూ 2025 జూన్‌లో 84 కేసులు నమోదయ్యా యని, అందులో 59 కేసులను విజయవంతంగా చేధించామని 73 మంది నేరస్తులను అరెస్టు చేయడం జరిగిందన్నారు. చోరీ అయిన నగదులో రూ.46,03,665 విలువగల వస్తువులు, నగదుతో పాటు రూ. 60,00,000 విలువ గల 430 మొబైల్ ఫోన్లు కలుపుకుని మొత్తం రూ. 1,06,03,665 విలువగల సొత్తు రికవరీ చేయడం జరిగిందని రికవరీ చేసిన వస్తువులను ఈ రికవరీ మేళా ద్వారా బాధితులకు అందజేస్తున్నామని తెలిపారు. నగరవ్యాప్తంగా జూన్‌లో 440 సిసి కెమెరాలను ఏర్పాటు చేశామని, 108 క్రైమ్ అవేర్‌నెస్ క్యాంపులు నిర్వహించామని ఆయన తెలిపారు. రాత్రి వేళలో గస్తీ నిర్వహణను మరింత పటిష్టం చేశామన్నారు. నగర అధికారులు రూపొందించిన చాట్ బిటి ద్వారా ఇప్పటివరకు రూ. 9.80కోట్ల విలువగల 6,534 మొబైల్ ఫోన్‌లను తిరిగి పోగొట్టుకున్న వారికి అందించామన్నారు. విశాఖ నగర పరిధిలో ఎవరైనా మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నట్లయితే 9490617916 నెంబర్‌కు చాట్‌బిటి ద్వారా లేదా సిఇఐఆర్ పోర్టల్ ద్వారా తమ ఫిర్యాదులు నమోదు చేయాలని కమిషనర్ సూచించారు. సమావేశంలో క్రైమ్ డిసిపి కె.లతామధురి, క్రైమ్ ఎడిసిపి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి రెడ్‌క్రాస్ సిబ్బంది అంత్యక్రియలు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : లాసెన్స్‌బే కాలనీ ఏరియాలో కామత్ హోటల్ ఎదురుగా ఉన్న ఎంపి భరత్ ఆఫీస్ ప్రక్కన ఫుట్‌పాత్‌పైన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని అతని వయసు సుమారు 45 సంవత్సరాలు ఉంటుందని పోలీసులు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హోం లెస్ షెల్టర్ పెద్ద వాల్తేర్ విశాఖపట్నం వారికి సమాచారం అందించారుర. ఎంవి సిఐ ఆదేశాలతో పోలీస్ కానిస్టేబుల్ ప్రశాంత్ ఆధ్వర్యంలో మృతదేహానికి జ్ఞానాపురం స్మశానవాటికకు తరలించన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హోంలెస్ షెల్టర్ పెద్ద వాల్తేర్ నిర్వాహకులు మురళి అంతక్రియలు నిర్వహించారు.